# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### 3గంటల కరెంటు ఏ మూలకూ చాలదు

కాంగ్రెస్ పార్టీ నాయకులకు వ్యవసాయం మీద కనీస అవగాహన లేదు. మూడు గంటల కరెంటు అని ఒకసారి, ఐదు గంటలు అని ఒకరు, 10 హెచ్‌పీ మోటర్లు అని ఇంకొకరు మాట్లాడుతున్నరు. ఒక ట్రాన్స్‌ఫార్మర్ మీద 10 హెచ్‌పీ మోటర్లు రెండింటికే లోడు ఎక్కువై కాలి పోతాయి. ఇప్పుడున్న మోటర్లు తీసేసి 10హెచ్‌పీ మోటర్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాల్సి వస్తది. వ్యవస్థ మొత్తం పాడయిపోద్ది. అది రైతుల మీద అధిక భారం పడుతది. 24 గంటల కరెంటు ఉంటేనే చివరి భూములకు పూర్తి స్థాయిలో నీరందడం లేదు. ఇక 3, 5 గంటలు ఇస్తే ఏ మూలకూ సరిపోదు. గతంలో రాత్రి కరెంటు ఇవ్వడం వల్ల రైతులు పొలాల్లో పాముకాటుకు, విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు పోయిన సందర్భాలు ఉన్నాయి. రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు ఇస్తుండు. దీంతో వెలుతురు ఉన్నప్పుడే పొలానికి నీళ్లు పెట్టుకొని సాయంత్రానికి ఇంటికి చేరుకుంటున్నం. మళ్లీ ఆయనే గెలవాలి.

**– పత్తిపాటి నాగిరెడ్డి, రైతు, కందిబండ, మేళ్లచెర్వు మండలం**

**మూడు గంటల విద్యుత్‌పై మండిపడుతున్న రైతన్న**

**24 గంటలు సరఫరా చేసే సర్కారు కావాలంటున్న అన్నదాతలు**









# కాంగ్రెస్ వద్దు.. కరెంట్ కావాలె

**కల్లబొల్లి మాటలు చెప్పే కాంగ్రెస్ వద్దు.. 24 గంటల నాణ్యమైన కరెంటు ఇచ్చే సర్కారు కావాలని రైతన్నలు కోరుతున్నారు. వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ చాలు.. 10హెచ్‌పీ మోటర్లు వాడాలంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులపై అన్నదాతలు మండిపడుతున్నారు. మూడు గంటల కరెంట్‌తో ఒక్క మూలైనా తడుస్తదా? అని ప్రశ్నిస్తున్నారు. అసలు వ్యవసాయం గురించి తెలుసా.. మూడు గంటల కరెంటు ఇస్తే సాగు బంద్ చేయాల్సి వస్తదని ఆందోళన చెందుతున్నారు. గతంలో పంటలు పండించడానికి అష్టకష్టాలు పడ్డామని, ఇప్పుడు నిరంతర విద్యుత్‌తో నిమ్మలంగా ఉన్నామని చెప్తున్నారు. మళ్లీ గత పాలన తెచ్చి తమ బతుకును ఆగం చేయొద్దని కోరుతున్నారు.**

### కరెంటు కోసం ఎదురుచూసే రోజులు మళ్లీ వద్దు

గతంలో కరెంటు ఎప్పుడొస్తదా అని పొలం కాడనే ఉండి ఎదురు చూసేటోళ్లం. మా నాయన రాత్రి పూట బాయికాడనే పడుకునేటోడు. అంతగా కాపలా కాసి నీళ్లు పెట్టినా సగమే పారేవి. తెలంగాణ వచ్చినంక అటువంటి కష్టాలు లేకుండా పోయినయ్. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇస్తుండడంతో పొలానికి నీళ్లు ఎప్పుడు కావాలంటే అప్పుడు ఉదయం పూటనే వచ్చి పెట్టుకుంటున్నం. నీళ్లు కూడా సరిగా పారుతుండడంతో పొలం మొత్తం పారుతున్నది. రైతులు సంతోషంగా ఉన్నరు. కాంగ్రెస్ వాళ్లు వ్యవసాయానికి మూడు గంటలే చాలంటున్నరు. వాళ్లను నమ్ముకుంటే మళ్లీ పాత కష్టాలే అనుభవించాల్సి వస్తది. మునుపటి రోజులు మళ్లీ మాకొద్దు. మా కష్టాలను గుర్తించి 24 గంటల కరెంట్ ఇస్తున్న వారినే గెలిపించుకుంటాం.

**– పాగుగంటి భిక్షం, దామెర, నాంపల్లి మండలం**



### కాంగ్రెస్‌కు ఓటేస్తే సాగు కష్టమే

కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతులు వ్యవసాయంపై ఆశలు వదులుకోవాల్సిందే. మళ్లీ చీకటి రాత్రులతో సహజీవనం చేయాల్సిన ప్రమాదం ఉన్నది. గతంలో రైతులు కరెంటు కోసం రాత్రివేళ పొలాల వద్ద కాపలా కాసేది. ముందుగా పెట్టినోళ్ల మోటరే ఎత్తుకునేది. ఆ తరువాత వారివి ఎత్తుకోకపోయేది. తెలంగాణ రాష్ట్రం వచ్చినాక కేసీఆర్ సార్ రైతుల రాతను మార్చారు. 24 గంటల కరెంటుతో ఎన్ని ఎకరాలైనా పారుతున్నది. దాంతో వ్యవసాయం పండుగలా మారింది. కాంగ్రెస్ పార్టీ మూడు గంటల కరెంటు చాలని రైతులను చిన్నచూపు చూస్తున్నది. వారికి ఓటుతో బుద్ధి చెప్తాం. పంట పొలాలు, స్థలాల విలువలు పెంచి, రైతులను రాజును చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఇస్తాం.

**– తిప్పరెడ్డి ఉదయ్‌శేఖర్‌రెడ్డి, రైతు, పాతగుడిబండ (కోదాడ రూరల్)**

### 10 హెచ్‌పీ మోటరు పెట్టుకోవడం సాధ్యం కాదు



ప్రస్తుతం ఉన్న భూగర్భజలాలు, మాకున్న భూముల్లో సాగు చేసే పంటల ప్రకారం 5 హెచ్‌పీ మోటర్లు వాడడమే కరెక్ట్. 10 హెచ్‌పీ మోటర్లు సాధ్యం కాదు. సాగుకు మూడు గంటల కంటు చాలంటున్న కాంగ్రెస్ వాళ్లు 5 హెచ్‌పీ మోటర్లతో మూడు గంటల కరెంటుతో సాగు ఎలా చేస్తారనేది తెలియకుండా మాట్లాడుతున్నరు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంట్‌తోనే సరిపోను సాగునీరు అందుతున్నయ్. గతంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో, తెలియక బోర్లు బావుల రాత్రి పగలు కాపలా కాసేటోళ్లం. ఓవర్‌లోడ్‌తో మోటర్లు కాలిపోయి.. సరిగా నీరందక సగం పంటలు ఎండిపోయేది. తెలంగాణ వచ్చినంక శాన నిమ్మలమైంది. సరిపోను కరెంట్ ఉంటుండడంతో రెండు పంటలు పండించుకుంటున్నం. మళ్లీ తెలంగాణ సర్కారు వస్తేనే కరెంట్ కష్టాలు లేకుండా ఉంటయ్.

**– రమావత్ కృష్ణ, పిల్లిగుండ్ల తండా, పీఏపల్లి**



### 10 హెచ్‌పీ మోటర్లు కాంగ్రెసోళ్లు కొనిస్తరా..

వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలని, 10హెచ్‌పీ మోటర్లతో మూడు గంటల్లో మూడెకరాలు పారుతుందని కాంగ్రెస్ నాయకులు చెప్పడం సరికాదు. అదే విధంగా తాము అధికారంలోకి వస్తే ధరణిని తీసేస్తామని అనడం రైతుల జీవితాలతో ఆడుకోవడమే. 10హెచ్‌పీ మోటర్లు కాంగ్రెస్ నాయకులు కొనిస్తరా? కాంగ్రెస్ పార్టీ వచ్చేది లేదు.. సచ్చేది లేదు. ఆ పార్టీ నాయకులు ఏం మాట్లాడుతారో వాళ్లకే తెల్వదు. రైతులను ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో ఓటు వేయం. కేసీఆర్ ప్రభుత్వానికే మా మద్దతు. రైతులమంతా బీఆర్ఎస్ వెన్నంటే ఉంటాం.

**– బాణోతు సైదా, కొత్తతండా, మఠంపల్లి మండలం**




### కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు కష్టాలే..

తెలంగాణ రాష్ట్రం వచ్చినాక 24 గంటల కరెంట్‌తో రంది లేకుండా సాగు చేసుకుంటున్నాం. ఉచిత విద్యుత్‌తో పంటలను మంచిగా పండించుకుంటున్నాం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు గంటల కరెంట్ ఇస్తామంటున్నది. దాంతో ఒక్క మూల కూడా తడవదు. మూడు గంటల కరెంట్‌తో వ్యవసాయం బంద్ చేసుకోవాల్సిందే. గత ప్రభుత్వాల హయాంలో ఎన్నో తిప్పలు పడ్డాం. కరెంట్ కోసం మోటర్ల దగ్గర పడుకుని రాత్రి, పగలు కాపలా కాసి నీళ్లు పెట్టినం. తెలంగాణ ప్రభుత్వం వచ్చినాక తొమ్మిది సంవత్సరాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు పండిస్తున్నాం. రైతులు సంతోషంగా ఉన్నరు. మూడు గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెసోళ్లు మాకొద్దు. 24 గంటలు ఇచ్చే బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తాం.

**– పన్నాల సైదిరెడ్డి, తాళ్లసింగారం, నూతనకల్ మండలం**





**ధరణి తీసేస్తే మళ్లీ దళారుల రాజ్యం వస్తది. పటేల్, పట్వారీల వ్యవస్థతో ఇబ్బందులు పడాలె. వీటిని మేము అంగీకరించం. అంటూ రైతులు ముక్త కంఠంతో చెబుతున్నరు. ధరణి పోర్టల్ తో భూ సమస్యలు తీరిపోయి.. రైతులు సంతోషంగా ఉండడం నచ్చని కాంగ్రెస్ ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని కుట్రలు చేస్తున్నది. పాత పటేల్, పట్వారీ వ్యవస్థను తీసుకొస్తమంటూ డ్రామాలు ఆడుతున్నది. ధరణి పోతే దళారులు, పైరవీకారుల రాజ్యం పుట్టుకొస్తుంది. లంచావతారులు వస్తరు. ఏ చిన్నపనికైనా అధికారులు తమ చుట్టూ ఏండ్ల తరబడి తిప్పుకుంటరు. పైసలు ముట్టజెప్పందే ఫైలు ముందుకు కదలదు. భూ రికార్డులు మారుతయ్. భూ దందాలు, సెటిల్మెంట్లకు తెరలేసి గొడవలు, ఘర్షణలకు అవకాశం ఏర్పడుతుంది. అందుకే కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై రైతులు భగ్గుమంటున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెబుతామని స్పష్టం చేస్తున్నారు.**



# ధరణి పోతే ధైర్యం చెడ్డట్టే..

### ధరణితోనే రైతుల భూములు భద్రం

రైతులకు మేలు చేసే ధరణి పోర్టల్‌ను తీసేసి భూమాతగా మార్చితే రైతులకు నష్టమే తప్ప ఉపయోగం ఉండదు. అయ్యా బాంచన్ అని బతిమాలాడాల్సిన పరిస్థితి వస్తుంది. రైతులకు తెలియకుండానే భూమిని ఇంకొకరి పేరు మీదకు ఎక్కించుకోవచ్చు. రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూ తన భూమి తనకు ఉన్నదా.. లేదా? అని తెలుసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ధరణి వచ్చిన తరువాత గ్రామాల్లో భూ సమస్యలు పోయాయి. రైతు వేలిముద్ర పడనిదే ఇంకొకరి పేరు మీదికి మార్చేందుకు వీలుండదు. ధరణి వల్ల లంచాలు, పైరవీకారులు పోయారు. ధరణి ఉంటేనే రైతుల భూములు భద్రంగా ఉంటాయి.

**– గన్న శ్రీను, రైతు, ఏనుబాముల, ఆత్మకూర్.ఎస్ మండలం**



### ధరణి వచ్చినంక దర్జాగా ఉన్నం

ధరణి వచ్చినప్పటి నుంచి భూముల విషయంలో నిశ్చింతగా ఉన్నం. గిదివరకు పహాణీల్లో వీఆర్వోలు ఇష్టమొచ్చినట్లు పేర్లు మార్చేది. ఆఫీసుల చుట్టూ తిరిగినా పనులు కాకపోయేటివి. ధరణి రాక ముందు భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత జమాబంది కోసం వీఆర్వో, ఆర్ఐ చుట్టూ నెలల కొద్ది తిరిగేది. గిప్పుడు గా బాధల్లేవ్. రిజిస్ట్రేషన్ కాగానే భూమిని పాస్ పుస్తకంలో ఎక్కిస్తారు. వేలి ముద్ర వేస్తే తప్ప రికార్డులు మారవు. రైతుల మేలు కోసం సీఎం కేసీఆర్ గింత మంచి ధరణి పోర్టల్‌ను తీసుకొస్తే దానిని తీసేస్తామని కాంగ్రెసోళ్లు అంటున్నారు. గట్లయితే మళ్లా రైతులు ఇబ్బంది పడుతరు. రైతులు నిశ్చింతగా ఉండుడు గా లీడర్లకు ఇష్టం లేనట్లుంది. మళ్లా దళారుల రాజ్యం తెస్తామని చూస్తున్నట్లున్నరు.

**– వీరూనాయక్, రైతు, దిర్శనపల్లి, నూతనకల్ మండలం**

### కౌలుదారు చట్టం తెస్తే భూ హక్కులు పోతాయి

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాకముందే రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కౌలు చట్టం తెస్తామంటున్నారు. అట్లయితే భూ యజమానులు, రైతులు తమ భూమిపై యాజమాన్య హక్కులు కోల్పోయే ప్రమాదం ఉన్నది. కాంగ్రెస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారు. రేవంత్‌రెడ్డి చెప్పే మాటలను రైతులు పట్టించుకునే పరిస్థితి లేదు. ధరణితోనే రైతుల భూములకు రక్షణ ఉంటుంది. రైతుల మేలుకోరే బీఆర్ఎస్ ప్రభుత్వానికే మా మద్దతు.

**– సమ్మిడి మట్టారెడ్డి, రైతు, మఠంపల్లి**



### ధరణి తీసేస్తే పైరవీకారులదే రాజ్యం



ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో రైతుల భూములకు మరింత భద్రత పెరిగింది. కాంగ్రెస్ పార్టీ వాళ్లు ధరణి పోర్టల్‌ను తీసేసి బాగుపడదామనే ఆలోచనలో ఉన్నారు. ధరణి తీసేస్తే మళ్లీ పాత రోజుల్లాగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి పైరవీకారులకు పైసలు ముట్టజెప్పాల్సి వస్తుంది. భూమి రిజిస్ట్రేషన్ల కోసం తీసుకొచ్చిన ధరణి వ్యవస్థ చాలా బాగుంది. దాని వల్ల అన్ని విధాలా కరెక్టుగా ఉన్న భూములు అమ్మడం, కొనడంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు నమ్మితే ఆగమవుతాం. ఒకవేళ ధరణి తీసేస్తే పైరవీకారులదే రాజ్యం అవుతుంది.

**– ఉయ్యాల రవి, రైతు, ఎండ్లపల్లి (సూర్యాపేట రూరల్)**

### ధరణి తీసేస్తామంటున్న కాంగ్రెస్ నాయకులను తరిమికొట్టాలి

గతంలో కాంగ్రెస్ నాయకులు చెప్పిన వాళ్లకే భూమి పట్టా అయ్యేది. మా భూములు మా పేరు మీద పట్టా కావాలంటే పనులు బంద్ పెట్టుకొని ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. అప్పటి పట్వారీలు పైసలు తీసుకొని ఒకరి భూమిని మరొకరి పేరు మీద ఎక్కించి రైతులను ఇబ్బంది పెట్టేవాళ్లు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో రైతులకు పట్టిన దరిద్రం పోయింది. ధరణితో రైతులకు తమ భూములపై పూర్తి నమ్మకం కలిగింది. దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట పడింది. ఇవన్నీ రేవంత్‌రెడ్డికి కనపడడం లేదా? ధరణిని తీసేసి సముద్రంలో పడేయాలంటున్నాడు. కొంచెమన్నా సిగ్గుండాలి. కాంగ్రెస్ ప్రభుత్వంలో రిజిస్ట్రేసన్ కోసం పడిగాపులు పడ్డాం. కాంగ్రెస్ లీడర్లు భూముల పేరిట అక్రమంగా సంపాదించుకునేటోళ్లు. ధరణి తీసేస్తామంటున్న కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లోకి రాకుండా తరిమికొట్టాలి.

**– చెరుకుపల్లి శ్రీను, రైతు, నెమ్మికల్, ఆత్మకూర్.ఎస్**

